ఆ 'ర్ధరాత్రి కాలం జోగుతుంటే చీకటి ఆవులించినట్టు ఓ పసిగుడ్డు ఏడుపు నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నిశీధిలో కలిసిపోయింది. కుక్కకూన పిచ్చి అరుపు, గుడ్లగూబ కంటి మిటకరింపు, భారంగా వీచి వెళ్ళిపోయిన ఓ తెమ్మెర దానికి సాక్ష్యాలు.



# పై పై చీకటి వెరింత

## వేణు

పాతికేళ్ళ పడుచు పిచ్చిపిల్ల ఆ రాత్రి రోడ్డు పక్కన పురుడు పోసుకుని తండ్రెవరో తెలియని పిల్లకు తల్లయింది. పట్టించుకోని ప్రపంచం నిర్లక్ష్యంగా నిద్రపోతోంది.

* * *

సాయంత్రం ఆరు గంటలు.

పోతూపోతూ ప్రియుడు కొరికితే కందిన ప్రియురాలి బుగ్గలా వుంది పడమటి ఆకాశం. అలలతో సయ్యాటలాడి సిగ్గుతో పరిగెట్టుకుంటూ వచ్చి వంటిని మెత్తగా వాటేసుకునే చిలిపిగాలి. వెంటపడే చూపును సుదూర తీరాలకు తీసుకుపోయే సముద్రపు కొస. ధనుర్మాసం— ఆ చోట, ఆ సాయంత్రం. స్వర్గమే!

అందుకే!

యవ్వనం ఎంట్రన్స్ పరీక్షలు రాస్తున్న పడుచులు, మనసులు పారేసుకున్న ప్రేమికులు, మూడు ముళ్ళతో ఒకటయిపోయి అప్పుడప్పుడే దాంపత్య రుచిని చప్పరిస్తున్న పసి జంటలు, తమ ప్రేమకు ప్రతిరూపాలుగా నిలచిన పిల్లల భవిష్యత్తును చర్చించుకునే నడి దంపతులు, బాధ్యతల బంధాల్నించి విముక్తులయి ఆధ్యాత్మిక, ఆలోచనలో పడ్డ పండుటాకుల్లు ఫలవని పేరంటానికే చేరిపోతారు అక్కడికి!

ఆనందం పట్టలేని కుక్కపిల్లలు ఒక దానిపై ఒకటి పడి దొర్లుతున్నట్టుగా దొంతరలుగా విరుచుకుపడుతున్న అలల్ని తదేకంగా చూస్తున్న రాఘవ ఆ ఒడ్డున.

తను చదివిన చదువుకి ఓ టేబులూ, కుర్చీ— దాని మీద కొన్ని కాగితాలు పడేసి రూల్సు ప్రకారం అక్షరాలు, అంకెలు అందులో నింపేస్తే ఎనిమిది వందలు యిస్తామని ప్రభుత్వం అంటే దానికి 'ఉద్యోగం' అని పేరు పెట్టుకుని సంవత్సరం క్రితం ఈ వూరి వడిలో వాలాడు. అమ్మా, నాన్నా తలో కుంకుమ బొట్టు పెట్టేసుకుని, అద్దాల వెనుక దాక్కుని, చెరో దండా వేసేసుకుని, గోడ మీదికి చేరిపోయారు. రాఘవకి తోడ బుట్టిన చెల్లి ఇద్దరు పిల్లలకి తల్లి. ఇంకా తోడు దొరకని రాఘవ వంటరిగాడే!

పున్నమి రాత్రి. వెన్నెల వంటి మీది నుండి జారుతుంటే పరవశంగా కళ్ళు మూసుకోవడం, చీకటి పూట భారంగా వూగిన చెట్టు కొమ్మని చూసి తనూ ఓ నిట్టూర్పు విడవడం, కుక్కపిల్ల కుయ్'మంటే ఆ భాషేదో తనకు అర్థమయినట్టు దాని తల మీద జాలిగా నిమరడం, 'ఆర్టిస్ట్'లా బతకాలనుకోవడం రాఘవ అలవాటు అందుకే అప్పుడప్పుడు తనూ 'కళాకారుడ్నే' అనుకుని తనకు తనే స్పందించేస్తుంటాడు.


వాస్తవంలో ఈ మధ్య అతని స్పందనకు ఆలంబన ఓ పిచ్చిది. అప్పుడప్పుడూ అక్కడక్కడా కనిపించే ఆమెని చూసి ముందు ముందు ఓ పిచ్చిదిలే అనుకున్నాడు. తరువాత తరువాత 'పెక్యూలియర్' అని కళ్ళెగరేశాడు. ఆపై ఆమె గురించిన ఆలోచనలు పెంచుకున్నాడు. ఇప్పుడు ఆ పిచ్చిది ఎదురుపడితే తదేకంగా చూస్తుంటాడు.

అలా తన చూపు ఎందుకు అలవాటు చేసుకుందో?

"పొడుచుకొచ్చే ఆ మురికి గుండెల్ని...?

"ఛీ...ఛీ" తనకుతనే సర్ది చెప్పుకుంటాడు. అనుభూతికి ఓ రంగు పులిమేస్తాడు. ఆమీద...

'ఆమెను చూస్తే ఎంతో జాలి. ఓసారి ఏడుపొచ్చింది కూడా... ఆ ఇరానీ హోటల్ పక్కన నల్లగా, ముద్దగా గుట్టలాపడివున్న టీమడ్డి. కాళ్ళు చాపుకుని కూర్చున్న ఆ పిచ్చిది. అందినంత ముద్ద తీసి అరచేతుల మధ్య పెట్టి మొహం ఆకాశం వైపు చాచి, చేతులు పైకెత్తి తెరుచుకున్న నోటి మీద బలంగా పిండుతోంది. ఉబ్బికొచ్చిన నరాలు, వణికే చేతులు, ఆశగా చూసే కళ్ళు, అప్పుడు నాలిక మీద రాలే ఓ టీ చుక్క సముద్రాన్ని తాగేసినంత తృప్తి ఆ మొహంలో' చూస్తున్న నాకంటి వెంట బయల్దేరి బుగ్గలమీంచి




జారిపోయాయి కన్నీళ్ళు' ... ఇలా ఇ౦టాడు. అనుకుంటాడు రాఘవ.

భిన్న ఆలోచనలు! స్వతహాగా పుట్టిన భావానికి పునాది వేసే ఆలోచన ఒకటయితే దాన్ని చంపేసే ప్రయత్నంలో సృష్టించుకున్న ఆలోచన మరొకటి!

ఇలా పలకరించకుండానే ప్రగాఢమయిన పరిచయాన్ని పెంచుకున్నాడు ఆ పిచ్చిదాని మీద. ఆమెతో తిరిగే మనుషుల్ని, చూసే కళ్ళనీ, మాట్లాడుకునే నోళ్ళనీ, పరిశీలిస్తూ తను మాత్రం ఓ ప్రత్యేక పంథాలో ఆలోచించాలనే గింజులాట కనిపిస్తుంది. రాటకు కట్టేసిన దూడలా!

ఇ౦తలో...

**రాఘవ పళ్ళు పటపటలాడాయి. పసివాళ్ళు పరమాత్ముడితో సమానం అంటారు. వీళ్ళా దేవుళ్ళు? గొడ్డలి పుచ్చుకు నరికి పారేయాలి. పిచ్చి కోపంతో పిడికిలి బిగుసుకున్నా ఏమీచేయులేని అసమర్థత ఓదార్చేసింది.**

ఆలల హోరులో కలకలం... ఎడం చేత్తో జారిపోతున్న నిక్కర్లు పైకెత్తుకుంటూ, మో చేయితో ముక్కుల్ని తుడిచేస్తూ, చేతి నిండా రాళ్ళతో వెంటపడుతున్నారు. తరుముతున్నారు. ఏడిపిస్తున్నారు... బెదిరిస్తున్నారు ...ఆనందిస్తున్నారు కేరింతలు...కొడుతున్నారు. ఏడేళ్లు కూడా దాటని గడుగ్గాయిలు.

అర్థం లేని భాషలో పలికే పదాలు, చూపులో భయం, నడకలో పరుగ, ఇసుకలో కూరుకుపోతున్న పాదాల్ని భారంగా పైకెత్తి ముందుకు పరుగెడుతోంది. ఆ పిచ్చిది.

పాతికేళ్లు దాటని పిచ్చి వయసు. తాడుతో కట్టి సిగలా ముడివేసిన జుట్టు, పక్కకు జారే జడపాయలు, బొడ్డు కింద నుంచి చుట్టుకున్న చింకి పాత, కుడి చేతిలో రంగు రంగుల గుడ్డ ముక్కలు, ఇంకే ఆచ్ఛాదనా లేక వదిలేసిన వళ్ళు. 'ఆఆ'లు రాస్తే అచ్చుగుద్దినట్లు కనిపిస్తాయి. అంత మురికి. వెనుక నుండి చూస్తే శ్మశానంలో శివుడిలా అనిపించే ఆ పిచ్చిది.

తామే నగ్నంగా వున్నట్టు తలలు దించేసుకున్నారు ఆడవాళ్లు. వయసు చచ్చిపోని చూపులు ఆమె పడుచుగుండెలపై దోబూచులాడుతున్నాయి. ముసలివాళ్లు పెదవులు విరిచేస్తున్నారు జాలిగా.

వెంబడిస్తున్న పిల్లల్ని తప్పించుకుంటూ ఒక్కసారిగా కూలిపోయింది. పడిపోతూ అమె తన్నేసిన రాయి మీద పడింది రాఘవ చూపు. ఎర్రని చుక్క తళుక్కుమంది మరో సంధ్యలా!

నల్లని ఆ మురికి పాదంలోంచి ఎర్రగా చిమ్ముకొస్తోంది రక్తం. నోటి చివర్లు చీలిపోయేలా అరుస్తోంది.

రాఘవ పళ్లు పటపటలాడాయి. పసివాళ్ళు పరమాత్ముడితో సమానం అంటారు. వీళ్ళా దేవుళ్ళు? గొడ్డలి పుచ్చుకు నరికి పారేయాలి. పిచ్చి కోపంతో పిడికిలి బిగుసుకున్నా ఏమీ చేయలేని అసమర్థత ఓదార్చేసింది.

"దొంగలంజాకొడుకుల్లారా! పిచ్చి దాంతో పరాశికాలేంట్రా? ముక్క లిరగదన్నేస్తా.. నాయాళ్ళరా" లుంగీ ముడి మరోసారి వేసి, నోట్లోంచి బీడీ ముక్కను బయటకు తీసి తుపుక్కున వుమ్మేసి, పిల్లల్ని అదిలించాడు. నలభయ్యుంటుంది వయసు. దగ్గరకొచ్చి కూర్చుని రక్తం కారుతున్న చోట యింత ఇసుకతీసి కప్పాడు.

"అమ్మే... మ్మే... మ్మే... మ్మే" చేతులు కాళ్ళు కొట్టుకుంది పిచ్చింది, జబ్బ పట్టుకుని లేవదీసి, నడుంచుట్టు చెయ్యివేసి, "ఇటేపు రాద్దన్నానా బుద్ధిలేని ముండకి బగమంతుడు సెప్పినా ఒకటే అనీ..." అనుకుంటూ భుజాన వాలిపోయిన పిచ్చిదాన్ని లాక్కుపోయాడు.

మసిబారిన ఆ నడుంచుట్టూ అతడి చెయ్యి, అలా వెళ్ళిపోతున్న వాళ్ళిద్దరూ, ఇసుకలో పడిన ఆ నాలుగు పాదాల అచ్చులు ఎవరెవరివో గుర్తుపట్టనంత దగ్గరగా ఆ యిద్దరూ అలా దూరమయిపోతుంటే...

గంగవెర్రులెత్తిపోయింది రాఘవ మనసు

ఆకాశం మీంచి దూసుకువచ్చి బండమీద పడి తునా తునకలయిపోయిన వానచినుకులా అయిపోయింది.

ఈ చరాచరసృష్టిలో ఎవరూ పట్టించుకోని పాపం అనాధ పిచ్చిది అనుకున్న తన వూహని సమాధిచేస్తూ ఆమెకి ఆసరాగా నిలచిన ఆ మనిషిని చూస్తే ఎంత జెలసీ తనకి.

"అనుభవం కోసం, అవకాశం కోసం ఎదురు చూసే అసమర్థుడి మొదటి లక్షణం అది. ఆకలితో భోరుమనే ఆమెకి కల్మషం లేకుండా కడుపు నిండా తిండిపెట్టే నిజాయితీలేదు. నలుగురి మధ్యా తలనిమిరి ఓదార్చే గుండెధైర్యంలేదు. కానీ... కళ్ళు మూసేసే చీకట్లో అరచేతిలో అవకాశం వుంటే కోరిక తీర్చేసుకునే... దొంగలం..."

తుళ్ళిపడి ఈలోకంలో కొచ్చాడు రాఘవ.

అలల వంపుల్లో వెన్నెల తళుక్కుమంటోంది అడుగులు ముందుకు పడుతున్నాయని అతనికి తెలియదు. నదాలనిండా నిండిపోయిందో పిచ్చి భావం. స్పృహలేని ఆలోచనతీరంవెంట తెలియని దిక్కువైపు రాఘవ వెళ్ళిపోతున్నాడు అప్రయత్నంగా.

అదే అతనిలో చోటు చేసుకున్న ఓ అలజడికి ఓంకారం

* * *

ఎటు తిరుగుతోంది సీలింగ్ ఫ్యాన్? వెనక్కా? ముందుకా? మూడు రెక్కల ఆ పక్షికి ప్రాణం వుందా? తిరిగే రెక్కల్ని చూపుతో పట్టుకుందామని...రెగ్యులేటర్ అయిదో నంబర్ మీదుంది. ప్రయత్నంలో కళ్ళు అలసిపోయాయి. ఓ పిచ్చి నవ్వు వినిపించింది. గట్టిగా, దగ్గరగా వినిపిస్తోంది. చెవులు మూసుకున్నా వినిపిస్తోంది. తన కోసమే. మెదడును తొలిచేసి పుర్రెను గుల్ల చేసి గూడు కట్టుకుని కాపురం చేస్తూ సరదాగా సరసాలాడుతూ నవ్వుకుంటున్నట్టు...గుండెకాయ పండిపోయి జారిపోయినట్టు..హృదయం నిండా ఖాళీ.


రాత్రుళ్ళు వూహలో బానేవుంది. పగలు పరీక్షగాచూసి పరవశించడం ఆనందం. కానీ ఆ నడుంమీద చెయ్యిపడేసరికి బుర్రలో వెయ్యి కాగడాలు.

* * *

దేవుడు మళ్ళీ 'ఈవ్‌ను' సృష్టించాడేమో అనుకున్నాడు రాఘవ ఆ వుదయం. రాత్రి జారిన వర్షంలో తడిసి మురికి కరిగిపోయిందేమో మేఘేంద్రుడు ముస్తాబు చేసిన జలకన్యలా వుంది ఆ పిచ్చిది. మాణిక్యం బయటపడింది. ఒళ్ళంతా విభూది పూసుకున్న పరమశివుడు గుర్తుకొచ్చాడు.

రంగుతేలిన ఆ పిచ్చి యవ్వనం ఆ రోజంతా రాఘవ గడిపిన ఏకాంత క్షణాల్లో, ఆలోచనల్లో, తలపుల్లో పూర్తిగా ఆక్రమించుకుని అతని అనుభూతుల రాజ్యంలో ఆ పిచ్చిదాన్ని పట్టపురాణిని చేసింది.

* * *






పిసినిగొట్లు

కమల, విమల తమ భర్తల పొదుపు గురించి మాట్లాడుకుంటున్నారు.

"మా ఆయన బలే పిసినికొట్టు, పిల్లికి బిచ్చం వెయ్యడు. ఆఫీసుకి నడిచి వెళతాడు. రోజు విడిచి రోజు భోజనం చేస్తాడు..." అంది కమల.

"ఓస్ ఇంతేనా, మా ఆయన్ని గురించి చెబితే ఎవరైనా ముక్కుమీద వేలేసుకుంటారు, మా పెళ్ళయిన కొత్తలో. హనీమూన్‌కి ఇద్దరం వెళితే ఖర్చని ఆయనొక్కరే వెళ్ళి వచ్చారు" అంది విమల.

—బి. సత్యమూర్తి (హైదరాబాద్)

సుఖం బజార్న పడుకుంటే చూస్తూ పూరుకునే ఓపికలేదు ఈ ప్రపంచానికి. కామానికి కళ్ళుండవు కావాలనుకునే తీవ్రమయిన కోరిక తప్ప. తమ మధ్యే తిరుగుతూ, తమలాంటి జీవితాన్నే గడుపుతూ, తన వునికి తనకే తెలియక, సుఖానికి దుఃఖానికి తేడా ఏవిటో అర్థం చేసుకోలేని పిచ్చిపడుచుదనం నగ్నంగా కళ్ళముందు కదలాడుతూంటే వూగిసలాడే మనసు వూరుకోదు.

ఏ అర్ధరాత్రో మనిషిని భుజంతట్టి ప్రోత్సహిస్తుంది. మానవత్వం కళ్ళు మూయడానికి నేనున్నానంటూ స్వార్థం వత్తాసు పలుకుతుంది.

అలా మనసుపడ్డ ప్రతివాడూ మోజు తీర్చేసుకుంటే... జరిగేది...!

* * *

ఆ పిచ్చి దానికి యిప్పుడు నాలుగో నెల.

శివుడు మూడో కన్ను తెరిస్తే బావుండు ననుకున్నాడు రాఘవ. ఆ మంటల్లోదూకి మసయిపోతే గానీ మనశ్శాంతి చిక్కదు. తను అందుకోవాలనుకున్నదేదో పరాయివాడు దోచేసి సొంతం చేసేసుకొని చెంప ఛెళ్ళుమనిపించి బయటకు నెట్టేసినంత అవమానం.

ఎత్తుగా కనబడే ఆమె కడుపు చూస్తే రాఘవకి గుర్తొచ్చేది రిక్షావాళ్ళ రక్తం కళ్ళ జూడాలని. వాళ్ళంతా తన నరాలతో పాయసం వండుకుని విందు చేసుకున్నట్టు... చిత్రవధ.

"అడక్కుండానే దాని సేతిలో పాపలా కాసేసి నప్పుడు మేం తలలు బాదుకొన్నామా? నీకా బాహతుంది. దానాకలి తీర్చేసావు. మాకా ఆకలి తీర్చే తాహతలేదు. అందుకే ఈ ఆకలి తీర్చేసాం. పడుచుపిచ్చిముండ పాపం నోరిడిసి సెప్పలేదు! దానికి మాత్రం రెండాకల్లుండవా?" ఓ రిక్షావాడు తనని ఓదార్చుతున్నట్టు.

ఆ రోజు నుండీ రిక్షా ఎక్కడం మానేశాడు రాఘవ.

* * *

నెలలు నిండుతున్న నిండు చూలాల్ని చూస్తే తనే పిచ్చి వాడయిపోతాడేమోననే విపరీతపు ఆలోచనలు రాఘవలో. ముందుకుపోతున్న గడియారాన్ని చూస్తే గగుర్పాటు. ఎక్కడో ఎత్తయిన మంచుకొండపై పసివాడిలా నగ్నంగా కూచుని ధ్యాన ముద్రలోకి జారిపోవాలని, నింగికీ నేలకీ మధ్య నిశీధిలో వేలాడాలని, శబ్దం వినిపించని చోటులో ఇంకా నిశ్శబ్దంగా కూచోవాలని, వచ్చే క్షణంలో బతకాలా-చావాలా? అనే పరాకాష్టకు చేరుకున్న సందిగ్ధత.

మామూలు మనిషిగా బ్రతకడానికి అర్హతలేవని, ఆమె అమాయక చేష్టలకు ఆకలి అరుపులకు ఈ సమాజం పెట్టినపేరు పిచ్చిదయితే!

ఓ వ్యక్తి మానసిక పరిపక్వతకు, నిరంతర అంతరంగ మథనానికి ఎంతగా దోహదం చేసిందో వూహని విశాల వినువీధుల్లోకి విసిరేసి ఆలోచిస్తే ఈ సంఘమే పిచ్చిదనిపిస్తుంది!

* * *


రాత్రి.

కాలం చీకటిని భుజాన వేసుకుని భారంగా అడుగులు ముందుకువేస్తుంటే వినబడే మూలుగు.

టిక్... టిక్... టిక్...

దానికి అనుగుణంగా కొట్టుకుంటున్నాయి రాఘవ రెప్పలు. ఎంత మార్పు తనలో. తనని తానే గుర్తుపట్టలేనంత. ఆఫీసులో అందరికీ ఆశ్చర్యం. చుట్టూ ఏం జరుగుతుందో పట్టించుకోని స్తబ్దత నిత్యం. ఇలా ఆలోచిస్తూ ఎంతో కాలం గడపలేడనే అతని నమ్మకం. తనలో ఇంతిగా అయిక్యమయిపోయిన ఆ పిచ్చి దానితో ఎటువంటిదీ అనుబంధం. మెదడులో అనుక్షణం కురుక్షేత్రం.

అర్ధరాత్రి దాటుతుంటే అతను విడిచిన నిట్టూర్పు ఏదో నిర్ణయానికి నాంది పలికినట్లుంది.






ఆగి ఆగి సాగి

టాంక్ బండ్ మీద వేగంగా పోతున్న తాతారావు కారు సడెన్‌గా ఆగిపోయింది. ఆగి, స్టార్టయి, ఆగి అలా అలా వెళుతోంది.

వెనకాల వున్న జనం అప్పటికే తిట్టుకుంటున్నారు. ఇంతలో ట్రాఫిక్ పోలీసు వచ్చి అడిగాడు.

"ఏమయింది, కారు పక్కకి తీసుకోండి."

"ఏం లేదు, మా ఆవిడకి ఎక్కిళ్లు వస్తున్నాయి" అన్నాడు తాతారావు వెనక సీట్లో పర్వతంలా వున్న భార్యని చూపిస్తూ.

—బి. సత్యమూర్తి (హైద్రాబాద్)

అప్పుడే... ఆ అర్ధరాత్రే కాలం జోగుతోంటే చీకటి ఆవులించినట్టు ఓ పసిగుడ్డు ఏడుపు నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ నిశీధిలో కలిసిపోయింది.

* * *

చీకటి సంఘర్షణ పగటికి పరిష్కారంగా మారింది. రాఘవచేత రెండు సూట్‌కేసులు సర్దించేసింది. ఆరోజే కటక్ ప్రయాణం. కౌగలించుకుని "ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూసి" అని కంటతడి పెట్టే ప్రాణ స్నేహితుడున్నాడక్కడ.

సెలవు చీటీ జేబులో పెట్టుకుని ఆఫీసుకి బయలుదేరాడు.

ఈ ఆలోచనలనుండి, ఈ వాతావరణంనుండి మరికొన్ని గంటల్లో విముక్తి లభిస్తుంది. ఎండ ఒంటిని తాకుతుంటే చాలా రోజులతర్వాత సూర్యుడు మళ్ళీ ఉదయించాడనిపించింది రాఘవకి. చక్కగా పడుతున్న అడుగుల్ని చూసుకుంటే జీవితం మళ్ళీ దారిలో పడుతోంది అనుకున్నాడు.

ఆ రోడ్డులోనే కొంతదూరంలో గుమిగూడిన జనం.

"పాపం పిచ్చిది. రాత్రి పురుడు పోసుకుని చచ్చిపోయిందిట!"

చెవిలో కరెంటు తీగెలు పెట్టినట్టు వినిపించాయి ఆ మాటలు. జనాన్ని తప్పించుకుంటూ లోపలికి దూరాడు.

తొలిసారిగా పిచ్చిదాని ఒంటినిండా గుడ్డ కప్పివుంది. తెల్లగా బొద్దుగా పక్కన పసికందు కేర్ మంటోంది. పరిచిన గుడ్డమీద అయిదు, పది పైసల బిళ్ళలు. పక్కనే నడుంమీద ,చెయ్యివేసి తీసుకుపోయిన ఆసామీ.

సానుభూతి వాక్యాలతో జనం పలచబడుతున్నారు.

కాసేపటికి పచ్చింది మూట గట్టుకుని వాడెళ్ళిపోతాడు.

ప్రాణంలేని పిచ్చి జీవిని ప్రభుత్వం పట్టుకెళ్ళిపోతుంది.

పసిగుడ్డు కేరింత మాత్రం మిగిలిపోతుంది.

పాలుగారే బుగ్గలు రక్తం చిందిస్తున్నాయి. రెప్పలు తెరిస్తే కంటిపాపను మసిచేసే ఎదురెండ సూర్యకిరణాలు మెరుపుల్లా.

ఏ చీకటిపూట సాక్ష్యంలేని పాపానికి గుర్తుగా అనాధగా మిగిలిన ఈ లేత మాంసపు ముద్దని అక్కునజేర్చి ఆలనా పాలనా చూడాల్సినవారంతా చేతులు దులుపేసుకున్నారంటే...!

అందరికన్నా పెద్ద ముద్దాయిలా తనకు తనే కనిపించాడు రాఘవ.

నిత్యం. క్షణం క్షణం. ఆమెతోనే కాపురం చేశాడు. తలపుల్లో ఆలోచనల్లో అనుభవించి వదిలేశాడు. అంతరంతరాలలోకి ఆహ్వానించి అయిక్యం చేసుకున్నాడు. ఆ నిజాలన్నీ అతని గుండె గోడలకు తగిలి ప్రతిధ్వనిస్తున్నాయి. మనసు సాక్ష్యం చెప్పడానికి ముందుకు వచ్చింది. ఆత్మ నోరు తెరిచి అర్థిస్తోంది. ప్రాధేయపడుతోంది. శాసిస్తోంది. ఎగతాళి చేస్తోంది.

"నీ బిడ్డను చేరదీసుకో. హృదయానికి హత్తుకో" అని.

ఎదలో ప్రకంపనాల్లా ఆ పదాలు మారుమ్రోగుతున్నాయి

అతని అరచేతిలో సెలవుచీటీ నలిగిపోయింది.

పగలబడి నవ్వి పిచ్చివాడిననుకుంటుందేమో ఈ సంఘం.

కానీ, పిచ్చితనంలోని గొప్పతనం తనకి బాగా తెలుసు

ఆలోచనలని తుంచేసి అడుగులు ముందుకు వేశాడు

గుక్కపెట్టి ఏడుస్తున్న పసిగుడ్డువైపు. ✱








అపార్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్, 1 టూ జడ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, బ్లాక్ నం. ఎ/3 గణపత్‌రావ్ కదమ్ మార్గ్, లోయర్ పరేల్ బొంబాయి-400 013.

everest/82/APL/319-J